సాక్షి ఒడిశా

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,91,185లు, బంగారం 500 మిల్లీగ్రాములు, వెండి 70 గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



బిసి ప్రాస్క గ్రామంలో దాహం కేకలు

జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని బీసీ ప్రాస్క గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి.

- 10లో.



జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక - 10లో.

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు కార్తీక్ ఎంపికయ్యాడు. అంతా అభినందించారు.

న్యూస్‌రీల్

కస్తూరి రంగన్ మృతికి గవర్నర్ సంతాపం

భువనేశ్వర్: భారత అంతరిక్ష ప్రయాణానికి రూపశిల్పి, దార్శనిక శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్ పద్మ విభూషణ్ డాక్టర్ కె.కస్తూరి రంగన్ మరణవార్త విన్న రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పరిశోధన రంగంలో ఆయన చేసిన విశేష కృషి యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని శ్రద్ధాంజలి ఘటించారు.

శ్రీజగన్నాథునికి మహాస్నానం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన శ్రీజగన్నాథ స్వామివారికి శుక్రవారం అర్ధాంతరంగా మహా స్నానం చేయించారు. ప్రధాన ఆలయ ప్రాంగణం జయ, విజయ ద్వారం ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి వాంతి చేసినట్లు దృష్టికి రావడంతో స్వామివారికి మహాబింబ స్నానం చేయించాల్సి రావడం గమనార్హం. ఈ సందర్భంగా శ్రీమందిరంలో భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిచిపోయింది.

యువతి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న రింకీ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియ సమితి సిమిలిబంచో పంచాయతీ ఎంవీ 61 గ్రామంలో శుక్రవారం ఓ 18 ఏళ్ల యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంవీ 61 గ్రామానికి చెందిన రింకీ మండాల్ గ్రామానికి సమీపంలోని ఓ చెట్టుకు ఉరికి వేలాడుతూ శుక్రవారం ఉదయం స్థానికులకు కనిపించింది. దీంతో వారు పొడియా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందకు దించి గ్రామస్తులను విచారించారు. తండ్రిని చిన్నప్పుడే కోల్పోవడం, తల్లి చదువు మాన్పించడం, ఓ యువకుడితో ప్రేమ సజావుగా సాగకపోవడం వంటి కారణాలు ఈ అఘాయిత్యానికి ఉసిగొల్పి ఉంటాయని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అనూప్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అవినీతి కాంట్రాక్టర్ అరెస్ట్



లక్ష్మీధర్ రాత్రాయ్

కొరాపుట్: అవినీతి కాంట్రాక్టర్‌ను విజిలెన్స్ విభాగం అరెస్ట్ చేసింది. నువాపడ జిల్లాలో 22 చెక్ డ్యామ్‌ల నిర్మాణంలో రూ..57 లక్షల నిధులను కాంట్రాక్టర్ లక్ష్మీధర రౌత్రాయ్ మళ్లించాడు. శుక్రవారం ఈ విషయం గమనించిన కొరాపుట్ విజిలెన్స్ విభాగం అతడిని అరెస్ట్ చేసి భవాని పట్న విజిలెన్స్ కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించింది.

అక్రమంగా తరలిస్తున్న తాబేళ్ల పట్టివేత



బస్తాల్లోని తాబేళ్లను బయటకు తీస్తున్న సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లను అటవీ శాఖ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ముందుగా అక్రమ రవాణాపై ఫారెస్టర్ రస్మీరంజన్ స్వాయ్‌కు సమాచారం వచ్చింది. దీంతో మోటు రేంజర్ మురళి అనూగులియాతో చర్చించి వాహనాల తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా 13 బస్తాల్లో తరలిస్తున్న 473 తాబేళ్లను గుర్తించారు. వాహనంలో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులు వాహనాన్ని వదిలి పరారయ్యారు. తాబేళ్లను ఎంవీ 79 గ్రామం వద్దనున్న అటవీ కార్యాలయానికి తరలించారు.



తాబేళ్లతో స్వాధీనం చేసుకున్న వ్యాన్



● ఉగ్రవాదం ఆపండి

కశ్మీరులో సుస్థిర ప్రశాంతత భారత దేశం సుస్థిర ప్రశాంతతతో ముడి పడి ఉంది. ఉగ్రవాదం నిర్మూలించి మానవీయ విలువలకు పట్టం గట్టాలని జాజ్‌పూర్ పట్టణ వాసులు మానవీయ పిలుపునిచ్చారు. కన్నెయిపూర్ నక్షత్ర విల్లా పరిసర వీధుల్లో ఆబాలగోపాలం కొవ్వొత్తి వెలుగుతో సంధ్య వేళలో శాంతి సందేశం ఊరేగింపు నిర్వహించారు.

- భువనేశ్వర్

రాష్ట్రంలో 12 మంది పాకిస్తానీయులు

- నిష్క్రమణ తాఖీదులు జారీ
- ఆచితూచి అడుగులు వేస్తున్న అధికార యంత్రాంగం


భువనేశ్వర్:

రాష్ట్రంలో 12 మంది పాకిస్తానీయులు నివసిస్తున్నారు. వీరంతా దీర్ఘకాలిక వీసాలు (ఎల్‌టీవీ)పై పబ్బం గడుపుతున్నారు. ఈ వ్యక్తులను త్వరలో అధికారికంగా దేశం విడిచి వెళ్లమని కోరనున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. మానవతా దృక్పథంతో లేదా ప్రత్యేక పరిస్థితులలో జారీ చేసిన దీర్ఘకాలిక వీసాల ఆధారంగా భారత దేశంలో నివసిస్తున్న విదేశీయులుపై దేశ వ్యాప్తంగా పునః మూల్యాంకనం చేసిన తర్వాత భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి, దేశం విడిచి వెళ్లడానికి నిర్ణయించిన గడువుకు మించి ఏ పాకిస్తానీ వ్యక్తి భారతదేశంలో ఉండకుండా చూసుకోవాలని కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం నాడు 26 మంది పర్యాటకులను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్నాయి. ఈ నెల 27 నుంచి పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేస్తున్నట్లు భారత దేశం గురువారం ప్రకటించింది. పాకిస్తాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు వీలైనంత త్వరగా స్వదేశానికి తిరిగి రావాలని సూచించింది. అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు స్వయంగా ఫోన్ చేసి, గడువు దాటి ఏ పాకిస్తానీ వ్యక్తి భారత దేశంలో ఉండకుండా చూసుకోవాలని కోరినట్లు వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రులు తమ తమ ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించాలని కూడా చెప్పారని ఆ వర్గాలు తెలిపాయి. అటువంటి వ్యక్తుల స్థితిని సమీక్షించి, జాతీయ భద్రతా ప్రోటోకాల్‌లు, ఇమ్మిగ్రేషన్ చట్టాలకు అనుగుణంగా ఉండేలా విధానాలను ప్రారంభించాలని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

రాష్ట్రంలో 12 మంది పాకిస్తానీ పౌరులకు నిష్క్రమణ నోటీసులు

కేంద్ర హోం శాఖ ఆదేశానికి అనుగుణంగా, ఒడిశా ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న 12 మంది పాకిస్తానీ పౌరులకు నిష్క్రమణ నోటీసులు అందించడానికి అధికారిక ప్రక్రియను ప్రారంభించింది. చట్టపరమైన స్థితి, వీసా వ్యవధి మరియు పౌరసత్వం లేదా ఆశ్రయం కోసం వ్యక్తులు సమర్పించిన ఏవైనా పెండింగ్ దరఖాస్తులను అధికారులు ధృవీకరించే ప్రక్రియలో ఉన్నారు. రాష్ట్ర హోం శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ, స్వదేశానికి తిరిగి పంపే ప్రక్రియను ప్రారంభించాలని హోం మంత్రిత్వ శాఖ నుంచి తమకు సూచనలు అందాయని తెలిపారు. ఈ ప్రక్రియ జాతీయ, అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి అవసరమైన అన్ని చట్టపరమైన విధానాలను అనుసరిస్తున్నారన్నారు. రాష్ట్రం నుంచి పాకిస్తానీయుల నిష్క్రమణ ప్రక్రియను సజావుగా, చట్ట బద్ధంగా అమలు చేసేందుకు కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకుని రాష్ట్ర అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

నాగేశ్వరి గుహలలో మాజీ ఎంపీ జయరాం పంగి



'నాగేశ్వరి గుహల్లో తవ్వకాలు అంగీకరించబోము'

కొరాపుట్: గిరిజనుల ఆరాధ్య దైవం ఉన్న నాగేశ్వరి గుహలపై తవ్వకాలు అంగీకరించబోమని కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి ప్రకటించారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి బల్దా గ్రామ పంచాయతీ నాగేశ్వరి గుహలను సందర్శించారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాగేశ్వరి గుహలను ఎకో టూరిజం ప్రాజెక్ట్ కింద శంకుస్థాపన చేశారని తెలిపారు. అలాంటి టూరిజం ప్రాజెక్ట్‌ని ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. ఈ గుహలను తవ్వి బాక్సైట్ తవ్వకాల కోసం అదానీ కంపెనీకి కట్టబెట్టిందని ఆరోపించారు. స్థానిక గిరిజనులు ఈ తవ్వకాలకు పెద్ద ఎత్తున్న వ్యతిరేక పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పంగి ఆరోపించారు.



స్థానిక గిరిజనులతో పంగి సమాలోచనలు

పాత్రికేయులకు తీపి కబురు

భువనేశ్వర్: రాష్ట్రంలో పాత్రికేయులకు మంత్రి తీపి కబురు అందజేశారు. వీరి సంక్షేమ పథకాల అమలు సంస్కరించినట్లు మంత్రి ప్రకటించారు. తాజా ప్రకటన ప్రకారం నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు పాత్రికేయులకు వర్తింపజేయనున్నారు. ఇదే తరహాలో వార్తా పత్రిక విక్రేతలకు అన్ని ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలో నిర్మాణ కార్మికులకు ఉద్దేశించిన సంక్షేమ ప్రయోజనాలు పత్రికా రంగం వర్గీయులు పొందనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా ప్రకటించారు.

ఈ పథకం ద్వారా 3.5 కోట్ల మంది లబ్ధిదారులను చేర్చడం లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 50 లక్షల మంది మాత్రమే వివరాలు నమోదు చేసుకున్నారని మంత్రి గణేష్ రామ్ ఖుంటియా అన్నారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం పాత్రికేయులు, వార్తా పత్రిక విక్రేతలు 'నిర్మాణ కార్మికుల కార్డు' పొందుతారు. ఇది వారికి వివిధ ఆర్థిక పరిహార ప్రయోజనాల ద్వారా ఆర్థిక భద్రతను అందిస్తుంది. కార్డుదారుడు సహజ మరణం పొందితే బాధిత కుటుంబానికి రూ. 3 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 6 లక్షలు పరిహారం అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 'గోపబంధు సంబాదిక్ స్వాస్థ్య బీమా యోజన'ను అమలు చేసిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద పాత్రికేయులు, వారి అర్హులైన కుటుంబ సభ్యుల వైద్య ఖర్చులను ప్రభుత్వం ఆరోగ్య బీమా కింద భరిస్తుంది.

88 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి మాఫియా విడిచిపెట్టిన వాహనం, అందులో ఉన్న గంజాయి

జయపురం: సరుకులు రవాణా చేసే ఒక టాటా మేజిక్ వాహనంలో 88 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి రశ్మీరంజన్ ప్రధాన్ శుక్రవారం వెల్లడించారు. ఒక టాటా మేజిక్ వాహనంలో రాత్రిళ్లు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో.. గురువారం సాయంత్రం పోలీసు అధికారి ఆదేశం మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ కుమార్ బెహర నేతృత్వంలో పోలీసు టీమ్ ఖొరాగుడ గ్రామ ప్రాంతంలో పెట్రోలింగ్ జరిపింది. దీంతో అటుగా వస్తున్న టాటా మేజిక్ వాహనం పోలీసులను గమనించడం.. బండిని అక్కడే వదిలి వాహనంలో ఉన్నవారంతా పారిపోయారు. వాహనం వద్దకు వెళ్లి తనిఖీ చేయగా.. గంజాయి దొరికింది. వెహికల్ నంబర్ ఆధారంతో గంజాయి వ్యాపారం చేస్తున్న నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసు అధికారి వెల్లడించారు.

ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్: స్థానిక రాజ్‌భవన్ అభిషేక్ హాల్ ప్రాంగణంలో ఒడిశా రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా కొత్తగా నియమితులైన విశ్రాంత ఐఏఎస్ అధికారి మనోజ్ కుమార్ పరిడాతో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి శుక్రవారం పదవీ ప్రమాణం చేయించారు. రాష్ట్ర సమాచార కమిషనర్లుగా ప్రాణబిందు ఆచార్య, కల్పనా పట్నాయక్, పవిత్ర మండల్‌లతో కూడా పదవీ ప్రమాణం చేయించారు.

కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ సురమా పాఢి, ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తదితరులు హాజరయ్యారు.



సమాచార కమిషనర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ హరిబాబు

రాష్ట్రంలో తొలి రోబోటిక్ మోకాలి మార్పిడి విజయవంతం



తొలి రోబోటిక్ మోకాలి మార్పిడిలో పాల్గొన్న ఎయిమ్స్ వైద్య నిపుణుల బృందం

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి రోబోటిక్ మోకాలి మార్పిడి విజయవంతమైంది. స్థానిక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్ వైద్య నిపుణుల బృందం ఈ విజయవంతమైన శస్త్ర చికిత్స నిర్వహించింది. ఒడిశా, తూర్పు భారత దేశ ప్రభుత్వ రంగ వైద్య సంస్థల్లో ఇదే మొట్టమొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి విధానం కావడం విశేషం. అత్యాధునిక రోబోటిక్ మోకాలి మార్పిడి సౌకర్యాన్ని ప్రవేశపెట్టి ఎయిమ్స్ భువనేశ్వర్ మైలురాయిని ఆవిష్కరించింది. ఈ ప్రాంతంలో అధునాతన వైద్య సంరక్షణకు కొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. స్థానిక ఎయిమ్స్ ఆర్థోపెడిక్స్ విభాగం వైద్య నిపుణుల బృందం 66 ఏళ్ల మహిళా రోగిపై మొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సని విజయవంతంగా నిర్వహించడం అత్యద్భుతమని వైద్య నిపుణుల వర్గం హర్షం వ్యక్తం చేసింది. కచ్చితత్వం, అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించిన ఈ ప్రక్రియ సజావుగా సాగింది మరియు ఆపరేషన్ తర్వాత రోగి ఇప్పుడు స్థిరంగా ఉన్నట్లు ఎయిమ్స్ భువనేశ్వర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అశుతోష్ బిశ్వాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోబోటిక్ శస్త్ర చికిత్స సౌకర్యం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఇది సమాజంలోని అన్ని వర్గాలకు అధునాతన ఆరోగ్య సంరక్షణ సేవలను పొందేలా చేస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.



రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స సరంజామా

కుందేళ్ల కళేబరాలు గుర్తింపు



కొత్తగా లభ్యమైన కుందేలు కళేబరం

రాయగడ: స్థానిక చెక్కాగుడ సమీపంలోని ప్రేమ్ పహాడ్ వద్ద తాజాగా మరో మూడు కుందేళ్ల కళేబరాలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. రెండు రోజుల క్రితం 5 కుందేళ్ల కళేబరాలు ఇక్కడ లభ్యమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అటవీ శాఖ సిబ్బంది గురువారం సాయంత్రం గాలింపు చర్యలు చేపట్టడంతో వేర్వేరు ప్రాంతాల్లో మరో మూడు కుందేళ్ల కళేబరాలను గుర్తించారు. దీంతో ఇప్పటివరకు 8 కుందేళ్ల కళేబరాలు లభ్యమయ్యాయి. అయితే ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి, లేదా ఎవరైనా వీటిని చంపి ఇక్కడ పడేశారా అన్న కోణంలో అటవీ శాఖ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వన్యప్రాణులకు రక్షణ కరువవుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

మావో డంప్ స్వాధీనం

మల్కన్‌గిరి: జిల్లాలో చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలోని కేందుగూడ గ్రామ సమీప అడవిలో 177 బెటాలియన్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్లు కూంబింగ్ నిర్వహించారు.

అయితే వారు తిరిగి వస్తున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ మావో డంప్ గుర్తించారు. దీంతో వెంటనే దానిని వెలికితీశారు. అందులో నాలుగు టిఫిన్ బాంబులు, ఒక 12 వోల్ట్స్ బ్యాటరీ, ఎలక్ట్రికల్ వైర్లు, పెద్ద ప్లాస్టిక్ డ్రమ్, ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర పేలుడు పదార్థాలు ఉన్నాయి. ఈ సామగ్రిని స్వాధీనం చేసుకొని బీఎస్ఎఫ్ క్యాంపుకు తరలించారు.



స్వాధీనం చేసుకున్న ఆక్సిజన్ సిలిండర్లు



డ్రమ్‌లో ఉంచిన మావో సామగ్రి



టిఫిన్ బాక్స్ బాంబులు

మే 20 నుంచి ధాన్యం మండీలు ప్రారంభం



హాజరైన మిల్లర్లు, అధికారులు

కొరాపుట్: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు (మండీలు) మే 20వ తేదీ నుంచి నబరంగ్‌పూర్ జిల్లాలో ప్రారంభమవ్వనున్నాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అశోక్ మెహతా కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో నేతృత్వంలో జిల్లా ప్రోక్రిమెంట్ సమావేశం జరిగింది.

మండీల్లో రైతులకు విద్యుత్, తాగునీరు, టార్పాలిన్లు, షెల్టర్, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఆదేశించారు. మొత్తం 40,359 మంది రైతులు తాము పండించిన ధాన్యం విక్రయించనున్నారు. సుమారు 25 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యం పెట్టుకున్నామని అధికారులు ప్రకటించారు. సమావేశంలో రాజ్యసభ ఎంపీ ప్రతినిధి రబి పట్నాయక్, లోక్‌సభ ఎంపీ ప్రతినిధి దేవదాస్ మహంకుడో, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ప్రతిప్ మిశ్ర, జదేశ్వర్ ఖడంగా తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సారా స్థావరాలపై దాడులు



దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా నిల్వ చేసే టబ్బులను చూపుతున్న ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, కొత్తూరు మండలాలకు అనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన సింగుపూర్, శిరడా, గురిసింగి గూడ, నేరడి గూడ పరిసరాల్లో 1,120 లీటర్ల నాటు సారా, 10,600 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన పులియబెట్టిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేసి, భారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ అనిత

అరసవల్లి: మలేరియాను జయించండి.. జీవితం నిలపండి అని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మలేరియాను సరైన జాగ్రత్తలు పాటించి నివారించుకోవచ్చునని, గత ఐదేళ్లలో మలేరియా కేసులు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. అయితే ప్రతి ఇంట్లో పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని ప్రథమ కర్తవ్యంగా మారుచుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైద్యశాఖ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సత్యన్నారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ మేరీ కేథరిన్, అడిషినల్ డీఎంహెచ్ఓ తాడేల శ్రీకాంత్, ప్రోగ్రాం కన్సల్టెన్సీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అరసవల్లి ఇన్‌చార్జి ఈఓగా శోభారాణి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈఓగా కె.శోభారాణిని నియమించారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె విశాఖ కనక మహాలక్ష్మి ఆలయంలో ఈఓగా పనిచేస్తూ.. అరసవల్లి ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఉన్న ఈఓ వై.భద్రాది మెడికల్ లీవులో వెళ్లినందున జిల్లా దేవదాయ శాఖ అధికారి(ఏసీ)తో పాటు అరసవల్లి ఆలయ ఈఓ బాధ్యతలు కూడా శోభారాణి చూడనున్నారు.

వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ హామీ ఏమైంది?

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలని ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా కొత్తూరు మండల కేంద్రంలో నిర్వాసితుల ఉద్దేశించి మాట్లాడారని, టీడీపీ అధికారంలోకి వస్తే నిర్వాసితులందరికీ స్పెషల్ ప్యాకేజీ ఇప్పిస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. గతంలో మీ మాటలు నమ్మి మోసపోయిన ప్రజలు మళ్లీ గంపెడు ఆశలతో మీ ప్రభుత్వాన్ని గెలిపించారని అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం కావస్తున్నా నిర్వాసితులకు ఇచ్చిన హామీ ఏమైందో తెలియడం లేదన్నారు.

'ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాకు ప్రత్యేకంగా ఎన్నికల ముందు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని, వాటిలో ఒక్కటి కూడా అమలుచేయలేదని, ఇప్పుడైనా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏను ఏర్పాటు చేస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజ్ ఇచ్చి ఆదుకుంటామన్న హామీలు నేటికీ నెరవేర్చలేదని గుర్తుచేశారు. జిల్లాలో ఫిషింగ్ హార్బర్స్ నిర్మాణం చేపట్టాలని, కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలన్నారు. గొట్టా బ్యారేజ్ నిర్మాణం చేసి 50 ఏళ్లు పూర్తి కావస్తోందని ఆధునికీకరణకు రూ. 1600 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయని రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలన్నారు.

ఉగ్రదాడిపై నిరసన



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, తదితరులు



జయపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

జయపురం: జమ్మూ–కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని ముస్లింలు ఖండించారు. ముస్లిం సొసైటీ నేతృత్వంలో శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీరఘునాథ్ మందిరం కూడలి నుంచి పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్ కలక్టర్ కార్యాలయంలో ప్రధాన మంత్రికి ఉద్దేసించిన మెమోరాండం అందించారు. జయపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ జంక్షన్ వద్ద ఉగ్రవాదుల కాల్పులను తీవ్రంగా ఖండించారు. రోటరీ క్లబ్ జయపురం ప్రెడ్ అధ్యక్షుడు రామగిరి పండా, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ యజ్ఞాశిస్ మహాపాత్రో, రోటరీ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి సంతాపం వ్యక్తం చేశారు.

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాల్లో..

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి నేతృత్వంలో మెయిన్ రోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. సాయుధ స్థూపం వద్ద నివాళులర్పించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ కౌన్సిల్ సభ్యులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కొరాపుట్ జిల్లా బందుగాం సమితి కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సస్మితా మెలక నేతృత్వంలో అమరులకు నివాళులర్పించారు.



కొరాపుట్: బందుగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, తదితరులు



జయపురం: గాంధీ కూడలి వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు

తాగునీటి సమస్య పరిష్కరించండి



తాగునీటి సమస్యను వివరిస్తున్న మహిళలు

రాయగడ: కొలనార సమితి పరిధిలో గల తెరువలి పంచాయతీలోని మూడో వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ ప్రాంత మహిళలు జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వార్డులో సుమారు 25 కటుంబాలకు చెందిన వంద మందికి పైగా జనాభా నివసిస్తున్నామన్నారు. ఆరు నెలలుగా తాగనీటి సమస్య ఉందన్నారు. సమస్యను సంబంధిత పంచాయతీ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని వివరించారు. వేసవి తీవ్రత రోజుజోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య కూడా పెరుగుతుందన్నారు. ప్రస్తుతం వార్డులో గల రెండు గొట్టపు బావులు పనిచేయడంలేదని, తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

బిసి ప్రాస్క గ్రామంలో దాహం కేకలు



నడుచుకుంటూ నీటిని తీసుకువెళుతున్న మహిళలు



నది నుంచి నీటిని సేకరిస్తున్న దృశ్యం

రాయగడ : జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని బీసీ ప్రాస్క గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. బిందెడు నీటి కోసం మైళ్ల కొద్దీ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో 20 కుటుంబాలకు చెందిన వంద మందికి పైగా ఆదివాసీలు నివసిస్తున్నారు. ఉన్న ఒక్క గొట్టపు బావి పాడైపోవడంతో సుమారు కిలోమీటరు దూరంలో గల సునాజొర్ తోట సమీపంలో ఉన్న నది నుంచి నీటతిని సేకరించి వాటిని తాగేందుకు వినియోగించాల్సి వస్తోందని గ్రామస్తులు అంటున్నారు. గత కొద్ది రోజుల కిందట కళ్యాణసింగుపూర్ సమితిలో జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఇదే సమస్యకు సంబంధించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇంతవరకు స్పందన లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక



కలెక్టరేట్ వద్ద పలకల కార్తీక్

పర్లాకిమిడి: న్యూఢిల్లీలో ఏప్రిల్ 30 నుంచి మే 5 వరకూ జరగనున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు కాశీనగర్ సమితి సిద్ధమణుగు గ్రామానికి చెందిన పలకల కార్తీక్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఇండియా (యస్.జి.ఎఫ్.ఐ.)భువనేశ్వర్ టీంకు ప్రాతినిధ్యం వహించనున్నట్టు జిల్లా శారీరక క్రీడాధికారి సురేంద్ర పాత్రో తెలియజేశారు. గజపతి జిల్లా రోలర్ స్కేటింగ్ అకాడెమీ (జి.డి.యస్.ఎ.)లో కార్తీక్ ఏడాదిన్నరగా శిక్షణ పొందాడు. గత ఏడాది నవంబరు 26, 27లో భువనేశ్వర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని అర్హత సాధించాడు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని యూబీ పరిశ్రమ సమీపంలోని శుక్రవారం రాత్రి 9.45 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖపట్నం నుంచి రణస్థలం వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఒక గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తికి మతిస్థిమితం లేదని, బిచ్చగాడని స్థానికులు తెలిపారు. దీనిపై జేఆర్ పురం ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

27న జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ అండర్ –13 బాల బాలికల జట్ల ఎంపికలు 27న జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే బాల బాలికలు 13ఏళ్ల లోపు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను చిత్తూరు వేదికగా వచ్చే నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఏపీ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు వెల్లడించారు. రేపు జరిగే ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు విధిగా తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కృష్ణమూర్తి కోరారు. మరిన్ని వివరాలకు డీఎస్ఏ బాస్కెట్ బాల్ కోచ్ జి.అర్జున్ రావురెడ్డి (9949291288)ని సంప్రదించాలని ఆయన కోరారు.

పెన్షనర్లలో ఐక్యత అవసరం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పెన్షనర్ల సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పెన్షనర్ల ఐక్యత అవసరం పెరిగిందని ఐక్యవేదిక సదస్సు నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలో ఎన్జీఓ హోమ్‌లో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మణికొండ ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తర్వాత గౌరవప్రదమైన జీవితం కోసమే పెన్షన్ విధానం ప్రవేశపెట్టారని, ప్రభుత్వ విధానాలు పెన్షన్ భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయని అన్నారు. ఇటీవల ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓ.పి.ఎస్) పెన్షనర్లకు నష్టం కలిగించే రీతిలో ఉద్యోగ విరమణ తేదీ బట్టి విభజన చేస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడం సరికాదన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సి.పి.ఎస్) విధానంలో చెల్లించే పెన్షన్ మొత్తానికి గ్యారెంటీ లేదని, నూతనంగా ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యు.పి.ఎస్) విధానంలో అనేక లోపాలున్నాయని తెలిపారు. అతి తక్కువ పెన్షన్‌తో తీవ్ర ఇబ్బందులులో ఉన్న ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం ఆశాజనకంగా లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు సంస్థల విశ్రాంత ఉద్యోగుల ఐక్య సదస్సు ఈ నెల 27వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు జరుగుతుందని జిల్లాలోగల వివిధ సంస్థలలో పని చేసిన పెన్షనర్లు పాల్గొని సదస్సు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డి.పార్వతీశం, కె.సోమ సుందర్‌రావు, ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, ఎస్.భాస్కర్ రావు, పి.సుధాకర్‌రావు, వి.చిన్నబాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



జయపురం: జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కోసం కోల్డ్ డ్రింకింగ్ వాటర్ ఫ్రిజ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సబ్‌కలక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి ప్రారంభించారు. సబ్‌కలెక్టర్ కార్యాయంలో చలివేంద్రాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్, ఎస్‌బీఐ జయపురం చీఫ్ మేనేజర్, జయపురం మైన్ బ్రాంచ్ మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోల్డ్ డ్రింకింగ్ వాటర్ ఫ్రిజ్

ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులతో తహసీల్దార్, తదితరులు

రాయగడ: వసుంధర పథకంలో భాగంగా జిల్లాలోని చంద్రపూర్ సమితి సాలిమ పంచాయతీలోని పురుడాగుడ గ్రామంలో శుక్రవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. చంద్రపూర్ తహసీల్దార్ భాస్కరచంద్ర సాహు, సాలిమ పంచాయతీ సర్పంచు ఫకీర్ మోహన్ గమిడంగ తదితరులు పాల్గొని 29 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు.

ఉపాధి కూలీలపై కక్ష సాధింపు



ఏపీఓ సత్యవతితో మాట్లాడుతున్న తాళ్లవలస ఉపాధి వేతనదారులు

ఎచ్చెర్ల: లావేరు మండలం తాళ్లవలస గ్రామంలో అధికార పార్టీ మేట్లు తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఉపాధి కూలీలు వాపోయారు. గ్రామంలో 78 మంది వరకు ఉపాధి పనులు చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కొందరు అధికార పార్టీ వారిని మేట్లుగా వేశారు. అందులో భాగంగానే తాళ్లవలసలో రాధను నియమించారని కూలీలు తెలిపారు. ఈమె రాజకీయ కక్షతో కొందరికి మస్టర్ వేయకుండా వేధిస్తోందని, కాసేపు బయటకు వెళ్లినా మస్టర్ వేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. గురువారం ఫీల్డ్ అసిస్టెంట్ రాకపోవడంతో కొన్ని గ్రూపుల కూలీలకు మస్టర్లు వేయడానికి వేరే వాళ్లను పంపించారు. దీంతో మస్టర్లు చదివే సమయంలో గొడవ జరిగింది. శుక్రవారం పలువురిని పనిలోకి రావద్దని చెప్పడంతో వారంతా ఏపీఓ సత్యవతిని కలిసి మాట్లాడారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రతి రోజు మీరు ఘర్షణ పడుతున్నారని అందువలన రెండురోజులు పనిని నిలుపుదల చేయాలని చెప్పారు. అందరికీ సమానంగా పనిని కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రాధ అనే మేట్ ఉంటే తాము పనిచేయలేమని, ఆమె తమను పనిచేయనివ్వరని వారు ఫిర్యాదు చేశారు.

సీఎం పర్యటనకు 1500 మంది పోలీసులతో బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుడగట్లపాలెంలో శనివారం పర్యటించనున్నారు. ఈ కార్యక్రమానికి 1500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చెప్పారు. బుడగట్లపాలెంలో పోలీస్ అధికారులతో శుక్రవారం భద్రత ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది ముఖ్యమంత్రి వచ్చిన నుంచి పర్యటన పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాలు పార్కింగ్, తనిఖీ లు వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నలుగురు అదనపు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలతో కూడిన అధికారులు బందోబస్తు పర్యవేక్షిస్తారని చెప్పారు. 17 రోప్, స్పెషల్, క్యూఆర్టీ టీంలు ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు. హెలీప్యాడ్, సభావేదిక, ఆలయ దర్శనం, లబ్ధిదారులతో ముఖా ముఖి వంటి కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

గొట్టా.. ముప్పు ఆగేదెట్టా..?




గొట్టా బ్యారేజీ వద్ద కొట్టుకుపోయిన రాతి కట్టడాలు

- వరదల ధాటికి పాడైన గొట్టా బ్యారేజీ రాతి కట్టడాలు
- పనులు పూర్తి చేయకుంటే బ్యారేజీకే ముప్పు
- ఆందోళన చెందుతున్న రైతులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కాలం గడుస్తున్న కొద్దీ గొట్టా బ్యారేజీ ప్రమాదకర పరిస్థితుల్లోకి జారుతోంది. జిల్లాకు జీవనాడి వంటి బ్యారేజీ పరిరక్షణను ప్రభుత్వం గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. వంశధార స్టేజ్–1, ఫేజ్–2 పనులకు జలయజ్ఞంలో భాగంగా రూ.933కోట్లతో పనులు ప్రారంభించారు. అప్పట్లో వంశధార గట్లు పటిష్టం చేయడం, హిరమండలం రిజర్వాయర్ నిర్మాణం, ప్యాకేజీ–87, 88లకు శ్రీకారం చుట్టారు. వంశధార నదిలో నీటిని ఒడిసిపట్టి జిల్లాలో 2.55లక్షల హెక్టార్లలో రెండు పంటలకు నీరందించాలంటే అది ఒక్క వంశధార నదిలో నీరు వృధా కాకుండా అడ్డుకట్ట వేయడంతోనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి ధర్మాన ఇంజినీర్లతో కలిసి డిజైన్ చేశారు. నదిలో వచ్చే నీటిని నిల్వచేసేందుకు గొట్టాబ్యారేజీ వద్ద గేట్లు ఏర్పాటు చేసి కొంతమేర రైతుల అవసరాలను బట్టి నీటిని వదిలేవారు. నీరు నిత్యం పారుతుండడంతో గొట్టా బ్యారేజీకి దిగువ భాగాన ఉన్న రాతి కట్టడాలు వరదలకు నీటి లో కొట్టుకుపోయాయి. ఆ తర్వాత వచ్చిన వర్షాలు, వరదలకు ఏటా కొంచెం, కొంచెంగా ఇసుక మేటలు వేసి రాళ్లు కొట్టుకుపోయి ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాతి కట్టడాలు సరిగా లేకపోవడంతో ఎంతోమంది మృత్యువాత పడ్డారు. వాస్తవానికి వంశధార ఎడమ కాలువ పనులు చేసేందుకు అప్పట్లో ఆధునికీకరణ పూర్తిచేసేందుకు రూ.380 కోట్లు ఇస్తే సరిపోయేది. ఇప్పుడు దాని పని అంచనా విలువ బాగా పెరిగిపోయింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ 12.91కోట్లు మంజూరు

వైఎస్ జగన్ హయాంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద ఏప్రాన్ (రాతికట్టడాల) పనులు చేసేందుకు గాను రూ.12.91కోట్లు నిధులు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే హిరమండలం రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ 176.35 కోట్లు, ఉద్దానం ప్రాంతానికి తాగునీరు సౌకర్యం కల్పించడానికి రూ.700కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు రూ 852.45కోట్లు, వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించేందుకు రూ.216.71కోట్లు, పాతపట్నం నియోజకవర్గంలో రెండు మండలాలకు మంచినీటి ప్రాజెక్టు కింద రూ.250కోట్లు మంజూరు చేశారు. ఏప్రాన్ పనులు ప్రారంభించేలోపే ఎన్నికల కోడ్ రావడంతో అర్ధంతరంగా టెండర్ల దశలోనే ఉండిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 11నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు వెయ్యకపోవడం దారుణమని రైతులు, నదీపరివాహక ప్రాంత వాసులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల జలవనరుల శాఖమంత్రి రామానాయుడు జిల్లాకు వచ్చినా ఎమర్జెన్సీగా చేయాల్సిన పనులేవీ చూడకుండా అచ్చెన్న ఇలాకాలో పనులు మాత్రమే చూసి తూతూమంత్రంగా వెళ్లిపోయారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో పనులు చేసేందుకు టెండర్లు పిలిచేందుకు ఆదేశాలిస్తారో లేదో వేచి చూడాలి.



చిందరవందరగా ఉన్న రాతికట్టడాలు

సీఈకి ప్రతిపాదనలు పంపించాం



హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద ఏప్రాన్ పూర్తిగా పాడై ఉంది, పనులు చేసేయాలని ఇటీవల జిల్లాకు వచ్చిన జలవనరుల శాఖ మంత్రి చెప్పారు. టెండర్లు పిలిచేందుకు కావాల్సిన దస్త్రాలను సీఈకి ప్రతిపాదనలు పంపించాం. తదుపరి ఆదేశాలు వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తాం. ఈ సీజన్‌లో దాని వల్ల ఎలాంటి ముప్పు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. వచ్చే సీజన్‌కు తప్పనిసరిగా పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నం చేస్తాం.

– పీవీ తిరుపతిరావు, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు, ఎస్ఈ

క్లుప్తంగా

27న సారిపల్లిలో బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావుదొర, కేవీ ప్రభావతి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు నెల్లిమర్ల మండలం సారిపల్లి గ్రామంలో గల చంపావతి నదిలో ఎంపిక పోటీలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే పురుష క్రీడాకారులు 85 కేజీలలోపు, స్త్రీలు 75 కేజీలలోపు బరువు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న అంతర్‌జిల్లాల స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9949721949 నంబర్‌ను సంప్రదించాలని స్పష్టం చేశారు.

28న జీఎంఆర్‌నైరెడ్‌లో ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ స్త్రీ, పురుషులు శిక్షణకు అర్హులన్నారు. పురుషులకు హౌస్‌వైరింగ్ (30 రోజులు), బైక్ రిపేరింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (30 రోజులు), కంప్యూటర్ ట్యాలీ అండ్ బేసిక్స్ (30 రోజులు), అలాగే స్త్రీలకు లేడీస్ టైలరింగ్ (31 రోజులు), బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ (35 రోజులు), మగ్గం వర్క్స్ అండ్ శారీ పెయింటింగ్ వర్క్స్ (31 రోజుల పాటు)లో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో రావాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 9989953145 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సాయిరాం



విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) జిల్లా కోఆర్డినేటర్‌గా డాక్టర్ కేసీపీ ఏవీ సాయిరాం నియమితులయ్యారు. ఈమేరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఉన్నారు. ఫారిన్ సర్వీస్‌పై ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీలో నూతన నియామకాలు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగ కమిటీలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పలువురిని నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీగా బంకపల్లి వాసుదేవరావు, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా దాసరిమాధవరావు నిమితులయ్యారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా ఐశ్వర్య యాదవ్



విజయనగరం ఫోర్ట్: జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలిగా ఐశ్వర్య యాదవ్ నియామితులయ్యారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆమెను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. జిల్లాలో మహిళల కోసం, వారి హక్కుల కోసం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

ఉపాధి వేతనం పెరగాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

రాజాం సిటీ: ఉపాధిహామీ వేతనదారులకు అత్యధిక వేతనం వచ్చేలా పని కల్పించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. రాజాం నియోజకవర్గ స్థాయిలో ఉపాధిహామీ పనులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పనుల తీరు, వేతనదారులకు అందుతున్న వేతనంపై ఆరా తీశారు. ఎండల దృష్ట్యా రెండు పూటలా పనులు చేయించాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేతనదారుకు రూ.307లు అందేలా పని కల్పించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, ఆర్డీఓ సత్యవాణి, ఎంపీడీఓలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పేద పిల్లలకు కార్పొరేట్ విద్య

- గత ప్రభుత్వం సంస్కరణల ఫలితమే
- ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచితవిద్య
- 2022-23లో పథకాన్ని ప్రవేశపెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తాజాగా నోటిఫికేషన్ జారీచేసిన సమగ్ర శిక్ష అభియాన్

రామభద్రపురం:

పేదింటి పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా, తరతరాల వారి తలరాతలను మార్చాలని గడిచిన ఐదేళ్ల పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో సంస్కరణల విప్లవం తీసుకువచ్చారు. ఒక చదువుతోనే పేదరికాన్ని అధిగమించడం సాధ్యమని బలంగా విశ్వసించి ప్రాథమిక విద్యావ్యవస్థలో ఎన్నడూ లేని విధంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. మనబడి నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. పేద విద్యార్థులకు అమ్మఒడి, పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బెల్టులు, టై తదితర పథకాలు పకడ్బందీగా అమలు చేశారు. ఈ క్రమంలోనే అక్షరాన్ని కాసులు పెట్టి కొనుక్కునే స్థోమత లేని ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు అంతరాలు, అడ్డగోడలు ఉండకూడదని ఆలోచించి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనను నాటి ప్రభుత్వం పక్కాగా అమలు చేసింది. దీనికి అనుగుణంగా ప్రైవేట్, అన్‌ఎయిడెడ్, పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022-23 విద్య సంవత్సరంలోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా 302 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా విద్యాహక్కు చట్టం-2009 ద్వారా గత ఏడాది 283 పాఠశాలల్లో 1326 మంది పేదవిద్యార్థులు ప్రవేశం పొందారు. వారిలో అధికశాతం విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం అదే ఉచిత విద్యా విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించేలా నోటిఫికేషన్ విడుదల చేసింది.



ఎంఆర్పీలకు సూచిస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యాహక్కు చట్టం-2009 అమలులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఐబీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ వరకూ వివిధ వర్గాల నుంచి ఉచిత విద్యకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.అర్హులైన విద్యార్థులు ఆధార్ ద్వారా ప్రాథమిక వివరాలతో హెచ్‌టీటీపీ://సీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అదే సమయంలో వారి నివాసానికి సమీపంలో ఉండే పాఠశాలలను ఎంపిక చేసుకునే వీలుంది.

అర్హతలు..

ఐబీ, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ అమలవుతున్న పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం 31.3.2025 నాటికి ఐదేళ్లు వయసు నిండి ఉండాలి.స్టేట్‌సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 1.6.2025 నాటికి ఐదేళ్లు నిండాలి. అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లను ప్రభుత్వం కేటాయించగా అనాథలు, హెచ్ఐవీ ఎఫెక్టెడ్, డిజేబుల్డ్ వారికి 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బీసీలు, మైనార్టీలు, ఇతరులకు ఆరు శాతం సీట్లు మంజూరు చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.2 లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ.1.44 లక్షల ఆదాయానికి మించి ఉండరాదు.



గ్లోబల్ వ్యూ స్కూల్

విద్యా హక్కు చట్టాన్ని పక్కాగా పాటించాలి



అందరికీ విద్య అందించేందుకు విద్యాహక్కు చట్టం మేరకు పేదలకు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.ఇది పేద విద్యార్థులకు వరం. నోటిఫికేషన్ ప్రకారం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి.అలాగే విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు పక్కాగా పాటించాలి. ఈ నెల 28వ తేదీలోపు ప్రతి పాఠశాల రిజిస్టర్ కావాల్సి ఉంది. ఈ నోటిఫికేషన్ వచ్చే విద్యా సంవత్సరం కోసం విడుదల చేశారు.

యు.మాణిక్యంనాయుడు,
డీఈవో, విజయనగరం

కోర్టు వాయిదాకు వెళ్లి వస్తూ నిందితుడి మృతి

- బస్సులో వస్తుండగా మార్గమధ్యంలో అస్వస్థత

కొత్తవలస: జిల్లా కేంద్రంలో గల కోర్టు వాయిదాకు వెళ్లి వస్తుండగా లక్కవరపుకోట మండలం రేగ గ్రామానికి చెందిన గొల్ల అప్పారావు(40) మార్గమధ్యంలో అస్వస్థతకు గురై మృతిచెందాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పారావు 2021వ సంవత్సరంలో జరిగిన ఒక హత్య కేసులో నిందితుడు. ఈ మేరకు శుక్రవారం విజయనగరం జిల్లా కోర్టుకు కేసు వాయిదాకు తల్లిదండ్రులు, భార్యతో కలిసి వెళ్లాడు. వాయిదా ముగిసిన తరువాత భార్య మందుల కొనుగోలు కోసం విజయనగరంలో ఉండిపోగా తల్లిదండ్రులతో కలిసి విజయనగరం-అనకాపల్లి బస్సులో కొత్తవలస వచ్చేందుకు బస్సు ఎక్కాడు. భీమసింగి జంక్షన్‌కు వచ్చేసరికి అప్పారావు తీవ్ర అస్వస్థతకు గురికాగా కొత్తవలస తహసీల్దార్ గేటువద్దకు వచ్చేసరికి ఆర్‌టీసీ బస్సు నుంచి అప్పారావును, తల్లిదండ్రులను సిబ్బంది దించేసిన అనంతరం బస్సు వెళ్లిపోయింది.

స్పందించని 108 సిబ్బంది

తీవ్ర అస్వస్థతకు గురైన అప్పారావును స్థానికులు గుర్తించి వెంటనే 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయగా కొత్తవలస, ఎల్.కోట, జామి మండలాల వాహనాలు అందుబాటులో లేవని వేరే మండలం నుంచి వాహనం రప్పించేందుకు గంటకు పైగా పడుతుందని అంతవరకు ఉంటే ఉండండి లేదంటే మీఇష్టమని సిబ్బంది బదులిచ్చారు. దీంతో కాసేపు వేచి ఉండి చెంతనే గల పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం అందించగా డాక్టర్ వచ్చి పరిశీలించి పల్స్ పడిపోయిందని మృతిచెందినట్లు చెప్పారు. దీంతో అక్కడే ఉన్న వృద్ధ తల్లిదండ్రులు భోరుమంటూ విలపించారు. స్థానికులు చందాలు వేసుకుని మృతదేహాన్ని స్వగ్రామం రేగకు ఆటోలో తరలించారు. కాగా మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.



అప్పారావును పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు

అదానీని అడ్డుకుందాం

- ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ గిరిశిఖరంపై ఉన్న మారిక గిరిజన గ్రామంలో భూములను, కొండను దోచుకునేందుకు వస్తున్న ఆదానీకి చెందిన గుజరాత్ కంపెనీ మారిక రాకుండా అడ్డుకుందామని సీపీఎం నేత, ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మారిక గిరిజనులతో కలిసి ఆయన మాట్లాడుతూ మారిక గ్రామ రెవెన్యూలో 35 సర్వే నంబర్లు ఉన్నాయని అందులో 32 సర్వే నంబర్లలో ఉన్న భూములు, ఇళ్లు, బడి, గుడి ఆదాని కంపెనీకి చెందిన హైడ్రో పవర్‌ప్లాంట్‌కు అప్పగిస్తామని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదానిపై ఉన్న శ్రద్ధ గిరిజనులపై లేకపోవడం బాధాకరమన్నారు. మారిక గిరిజన గ్రామాన్ని ఆదానీ గ్రూప్‌కు అప్పగించడాన్ని వెనక్కి తీసుకోకపోతే జిల్లాలో ఉన్న గిరిజనులంతా ఏకమై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదానీ గ్రూప్ మారికలో అడుగుపెట్టకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బాబూరావు, ఆనంద్ రామకృష్ణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అదానీ గ్రూప్‌ను అడ్డుకుంటామంటున్న గిరిజనులు, రైతు సంఘం నాయకుడు చల్లా జగన్

సమస్యలు చెప్పుకునే వేదిక వెల్ఫేర్ ‘డే’

విజయనగరం క్రైమ్: వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది వారి సమస్యలు చెప్పుకునేందుకు ప్రతి శుక్రవారం తన చాంబర్‌లో పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్‌జిందల్ చెప్పారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఉత్తర్వులతో ప్రతివారం సంక్షేమ రోజును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్, ఏఆర్, ఫింగర్‌ప్రింట్స్, ఎస్బీఎఫ్, హోంగార్డ్స్, మినిస్టీరియల్ సిబ్బంది ఇలా ప్రతి ఒక్క ఉద్యోగి వారి పనుల్లో ఎదురయ్యే బదిలీలు, మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్, వ్యక్తిగత, వృత్తిపరమైన వినతులను ఈ వెల్ఫేర్ డే సందర్భంగా తెలియజేయగా పరిశీలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



వెల్ఫేర్ డే సందర్భంగా సిబ్బంది విజ్ఞాపనలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

త్వరలో జిల్లాకు అదనపు జాగిలాలు

- నూతన కెన్నల్స్ నిర్మాణానికి చర్యలు
- పాత వాటిని పరిశీలించిన ఎస్పీ

విజయనగరం క్రైమ్: నేరాలు జరిగినప్పుడు నిందితులను కనిపెట్టేందుకు సిబ్బందితో పాటు నేరం జరిగిన ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తులో ముఖ్యభూమిక పోషిస్తున్న జాగిలాలకు సరైన శాశ్వత విశ్రాంతి గదుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. ఈ మేరకు ఏఆర్ క్వార్టర్స్‌లో ఉన్న పాతభవనాలను ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం ఏఆర్ సిబ్బందితో కలిసి పరిశీలిచారు. పాతబడిన గదులను, జాగిలాలు ఉంటున్న స్థలాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందితో పాటు నేరం జరిగే ప్రదేశానికి వెళ్తున్న జాగిలాలకు శాశ్వతమైన గదులు లేవని, నేరాలను కనిపెట్టడంలో, కేసు ఛేదనలో సిబ్బంది కంటే ముందే గుర్తులు ఇవ్వడంలో కీలక పాత్రను జాగిలాలు పోషిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న జాగిలాలకు అదనంగా మరికొన్ని నార్కొటిక్స్, స్నిఫ్ఫర్, ట్రాకింగ్ జాగిలాల అవసరం జిల్లా పోలీస్ శాఖకు ఉందన్నారు. ప్రతిపాదనల మేరకు అదనపు జాగిలాలు జిల్లాకు రానున్నట్లు తెలిఆపరు. ప్రస్తుతం ఏఆర్‌క్వార్టర్స్‌లో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఆర్ సిబ్బందిని ఆదేశించారు. పరిశీలనలో ఎస్పీ వెంట ఎస్పీ సీఐ లీలారావు, సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, జాగిలాల హ్యాండ్లర్స్ పాల్గొన్నారు.



జాగిలాల విశ్రాంతి గదులను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో ఎస్బీ సీఐ లీలారావు, డాగ్ హేండ్లర్స్

16 అడుగుల గిరినాగు పట్టివేత

- ఊపిరి పీల్చుకున్న రైతులు



గిరినాగును భద్రంగా పట్టుకున్న వన్యప్రాణ సంరక్షణ సమితి ప్రతినిధి కృష్ణ, పక్కనే బుస కొడుతున్న గిరినాగు

వేపాడ: మండలంలో చామలాపల్లి నుంచి వెంకయ్యపాలెం వెళ్లే రహదారిలో అరిగివాని చెరువువద్ద 16 అడుగుల గిరినాగును స్థానికులు గుర్తించారు. శుక్రవారం రాత్రి అరిగివాని చెరువు కల్లాలవద్ద బుస కొడుతుండగా అక్కడ ఉన్న రైతులు గమనించి చూసి గిరినాగుగా గుర్తించారు. తక్షణమే వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రం ప్రతినిధి వరపుల కృష్ణకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని 16 అడుగుల గిరినాగును భద్రంగా పట్టుకుని గొనె సంచెలో భద్రపరిచారు. ఉదయాన్నే అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని తెలిపారు. దీంతో స్థానిక రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఉపాధి హామీ అధికారుల తీరుపై జెడ్పీ ఛైర్మన్ అగ్రహం

గుర్ల: జాతీయ ఉపాధి హామీ అధికారుల తీరుపై జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గుర్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. గోషాడ, గరికివలసలలో ఉపాధి హామీ పనులు ఎందుకు ప్రారంభించలేదని ఏపీఓ రత్నమాలను ప్రశ్నించారు. వచ్చే వారం ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తామని ఆమె బదులు ఇచ్చారు. జమ్ములో ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియకుండా ఉపాధి హామీ పనులు ఎలా చేపడతారని సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి ప్రశ్నించారు. టీడీపీ నేతలు చెప్పినట్లు ఉపాధి పనులు చేపట్టడం సమంజసం కాదని ఏపీఓకు జెడ్పీ ఛైర్మన్ సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న మేట్లను తొలగించకుండా కొత్త మేట్లను స్థానిక నేతలు సిఫార్సు చేసిన వారిని వేయాలని జెడ్పీ ఛైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక ఆరోపణలు వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను తక్షణమే తొలగించాలని ఏపీఓను ఆదేశించారు. కొండగండ్రేడులో టీడీపీ నేతలు చెప్పారని ఉపాధి హామీ పనులను ప్రారంభించలేదని సర్పంచ్ సారిక గోవింద్ జెడ్పీ ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ వేతనదారులకు కనీస వేతనం రూ.307 ఉన్నప్పటికీ రోజుకు రూ.50 నుంచి రూ.100 వరకు వస్తుందని , కనీస వేతనం రూ.300లు వచ్చేలా పనులు చేపట్టేలా తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధి హామీ అధికారులకు జెడ్పీ ఛైర్మన్ సూచించారు. అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని , గ్రామాల్లో తరచూ పర్యటించకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు అంబళ్ల లక్ష్మి, తోట తిరుపతిరావు, ఎంపీడీఓ శేషుబాబు, డీటీ నారాయణమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



ఏపీఓ రత్నమాలను ప్రశ్నిస్తున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలి

- చలి వేంద్రాలు ఎక్కువగా ఏర్పాటు తప్పనిసరి
- పీజీఆర్ఎస్, ఉపాధి హామీకి ప్రాధాన్యం
- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో గృహనిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహ నిర్మాణాల్లో ప్రతివారం పురోగతి కనిపించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్, హౌసింగ్, నరేగా, తాగునీటి సమస్యలు, గ్రామ/వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పెన్షన్ పంపిణీ, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం జన్‌మాన్ కింద చేపట్టిన గృహాలకు రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు అదనంగా మంజూరు చేస్తున్నప్పటికీ ప్రగతి కనిపించడం లేదన్నారు. ఏ పథకానికి లేనివిధంగా ఈ పథకానికి నిధుల కొరత కూడా లేదన్నారు. చేపట్టిన నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు కూడా త్వరగా చెల్లించనున్నట్లు కలెక్టర్ గుర్తుచేశారు. జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, కావున చలివేంద్రాలు అన్ని చోట్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పనిప్రదేశాలు, ఉపాధి హామీ, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు కచ్చితంగా ఉండాలని, వాటిని పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

పింఛనర్లలో అసంతృప్తి

ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయంలో పింఛన్‌దారులు అసంతృప్తి చెందకుండా ప్రతి మండలంలోని ప్రత్యేకాధికారులు పింఛన్ల పంపిణీ రోజున పాల్గొని ఉదయం 7 గంటల నుంచి 10 గంటల్లోగా శత శాతం పంపిణీ కావాలన్నారు. జిల్లాలో 1,521 కొత్తగా వితంతు పింఛన్లు మంజూరయ్యాయని, కావున ఆయా మండలాల్లోని కొత్త పింఛన్ల సొమ్మును కూడా ముందుగా డ్రా చేసుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో చెరువు గట్ల పనులతో పాటు ఫారంపాండ్స్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, హౌసింగ్, డీఆర్డీఏ, డ్వామా పీడీలు పి.ధర్మచంద్రారెడ్డి, ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న, ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, మండల ప్రత్యేకాధికారులు ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఏపీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పాముకాటుతో దివ్యాంగుడి మృతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో పాముకాటుతో ఓ దివ్యాంగుడు మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అట్టాడ పూడిపినాయుడు(39) దివ్యాంగుడు. గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో డాబాపై నిద్రించేందుకు వెళ్తున్న క్రమంలో మెట్ల వద్ద మాటువేసి ఉన్న పాము ఒక్కసారిగా కాటువేసింది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి వెంటనే తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పూడిపినాయుడు దివ్యాంగ పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్నాడు. మృతుడికి భార్యతో పాటు పాప, బాబు ఉన్నారు. ఇంటి యజమాని చనిపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా రోదించారు. మృతదేహానికి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పూడిపినాయుడు(ఫైల్)

బైక్‌ల దొంగ అరెస్ట్

ఎంవీపీకాలనీ (విశాఖ): నగరంలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న పాత నేరస్తుడిని ఎంవీపీ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర క్రైం ఏడీసీపీ మోహనరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. మార్చి 17న పెదవాల్తేర్ రిలయన్స్ మార్ట్ ఎదుట దాసరి శంకరరావు అనే వ్యక్తికి చెందిన హోండా యాక్టివా బైక్ దొంగతనానికి గురైంది. మార్ట్ ఎదుట వాహనాన్ని పార్క్ చేసిన శంకరావు పక్కనే ఉన్న చికెన్ షాపునకు వెళ్లి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీనిపై ఎంవీపీ క్రైం పోలీసులకు ఆయన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ద్వారకా క్రైం సీఐ చక్రధర్‌రావు నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు. మార్ట్ సమీపంలోని సీసీటీవీ పుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. నిందితుడు చివరిగా సంచరించిన ప్రాంతాన్ని గుర్తించి, సెల్‌ఫోన్ నంబర్ కనుగొన్నారు. సెల్‌ఫోన్ ఆధారంగా నిందితుడిని పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం, కోట సీతారామపురం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు కోట శివగా గుర్తించారు. ఈ నెల 24న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా విస్తుపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. నగరంలోని ఎంవీపీ కాలనీ, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ద్వారకా పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 17 వాహనాలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. 2024 నుంచి శివ విశాఖలో వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. అలాగే అతనిపై 31 పాత కేసులతో పాటు జీఆర్పీలో సస్పెక్ట్ షీట్ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి దగ్గర సేకరించిన వివరాలతో 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం శివను కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన ద్వారకా క్రైం సీఐ చక్రధర్‌రావుతో పాటు ఎస్సై అప్పలరాజు, ఏఎస్సై కిశోర్‌బాబు, పీసీలు జగత్ కిరణ్, హరిప్రసాద్, సాయి, అప్పలరాజు, అగస్టీన్‌లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఏడీసీపీ, ఏసీపీ తదితరులు

బ్యారేజీ దాటిన ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని నేరడి బ్యారేజ్‌ను ఏనుగుల గుంపు శుక్రవారం దాటి వెళ్లింది. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలకు ఏనుగుల గుంపు విలవిల్లాడుతోంది. సరైన చెట్ల నీడ లేకపోవడం, వేసవి తీవ్రత నుంచి ఉపశమనం లేకపోవడమే కారణమని ఫారెస్టు సిబ్బంది తెలిపారు. గురువారం రాత్రి బిల్లుమడ నుంచి నేరడి-బి మీదుగా వంశధార నదీ తీరం వెంబడి పయనించి శుక్రవారం నేడు నేరడి బ్యారేజీని ఏనుగులు దాటాయి. ఇదే నదీతీరంలో ఏపుగా ఉన్న జీడిమామిడి తోటలకు చేరుకున్నాయి.

మలేరియా రహిత జిల్లాగా మార్చుదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో మలేరియా రహిత జిల్లాగా మార్చుదామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా చేపట్టిన అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వ ఉన్న మంచి నీటిలో మలేరియాను వ్యాప్తి చేసే ఆడ ఎనాఫిలిస్ దోమలు పెరుగుతాయన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు దోమల నివారణకు సహకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ అధికారులు వసతి గృహాల విద్యార్థులు దోమకాటుకు గురికాకుండా ముందుగానే వసతి గృహాల కిటికీలు, గుమ్మాలకు దోమల జాలీలు అమర్చాలన్నారు. విద్యార్థులకు దోమల నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 157 గ్రామాలను మలేరియా అధిక ప్రభావిత గ్రామాలుగా గుర్తించి రెండు విడతల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని ఆదేశించామన్నారు. మే 15వ తేదీ నుంచి మొదటి విడత పిచికారీ మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సహాయక మలేరియా నివారణ అధికారి రమణ, తదితరులు పాల్గొన్నారు.